క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: నందికంటి శ్రవణ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటాపురం డివిజన్ ఇందిరానగర్‌లో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: 33/11కేవీ బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆంజనేయనగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్, ఆకృతి టౌన్‌షిప్, సరస్వతి కాలనీ, గాయత్రీ నగర్, లక్ష్మినగర్(హుడా), సాయిమారుతీనగర్, శ్రీనివాస్ కాలనీ, బృందావన్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, బొమ్మక్ బ్రదర్స్ కాలనీ, ద్వారకానగర్, ఉదయ్‌నగర్, కేశవనగర్, సాయిరాంనగర్, సత్తిరెడ్డినగర్, అక్షయ్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

హబ్సిగూడ: కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్, జలమండలి జీఎం సంతోష్‌కుమార్, సిబ్బందితో కలిసి బుధవారం హబ్సిగూడలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్లు సత్యనారాయణ, రవీందర్, ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం కాప్రా, ఏఎస్‌రావునగర్, నాచారం, చిలుకానగర్, హబ్సిగూడ, రామంతాపూర్, ఉప్పల్ డివిజన్ల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ



బాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్టీసీ యూనియన్ నేత బాల్‌రెడ్డిని బుధవారం హెచ్‌బీకాలనీ, లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



మల్కాజిగిరి: లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలను మల్కాజిగిరిలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రైల్వే పాసుల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ రైల్వే పాసులు వారం రోజుల్లో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కేసపాగ రాంచందర్‌మాదిగ, నర్సింహ, దాసరి బాబు, రాములు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లతో విద్యార్థుల తల్లిదండ్రులు

మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలోని అభయ ప్రద స్పీచ్ పాఠశాలలో ట్రాక్స్ సొసైటీ, ఐసీఐసీఐ లాంబోర్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైడ్ టూ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు బండి నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. మొత్తం 30 మంది తల్లిదండ్రులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, అభయ ప్రద స్పీచ్ పాఠశాల వ్యవస్థాపకురాలు ధనలక్ష్మీ, స్పెషల్ బీఈడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో మేటి..

- జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- 68 ఏళ్ల నుంచి ఇంజినీర్లుగా తయారు చేస్తూ..
- కళాశాలలో 5, 6 తేదీల్లో జిల్లా క్రీడోత్సవాలు



రామంతాపూర్ జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం

రామంతాపూర్: నిజాంకాలం 1922లో ఉస్మానియా టెక్నికల్ కాలేజీ పేరుతో రామంతాపూర్‌లోని 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కళాశాల ప్రారంభమైంది. 1954లో అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతులమీదుగా జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పేరుతో ప్రారంభించబడింది. రాష్ట్రంలోని అతి పురాతనమైన ఈ పాలిటెక్నిక్ కళాశాల నుంచి 68 ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులు ఇంజినీర్లుగా తయారై సేవలందిస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన పలువురు విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన వారు ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే అయిన ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, సినీ పాటల రచయిత చంద్రబోస్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ కళాశాలలోనే చదివారు. ఈ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో 60, సివిల్ ఇంజినీరింగ్‌లో 120, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్‌లో 60, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 120, మెటలాజికల్‌లో 60, దేశంలో ఏ ప్రభుత్వ కళాశాలలో లేని అరుదైన కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీలో 60 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షలతో వీటిని భర్తీ చేస్తారు.

వసతి గృహాలు..

ఈ కళాశాల ప్రాంగణంలో 440 కెపాసిటీ ఉన్న బాలుర వసతి గృహం, 80 కెపాసిటీ ఉన్న బాలికల వసతి గృహాలు ఉన్నాయి. ప్రత్యేక సందర్భంలో ఈ కళాశాలలో రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నారు. కళాశాల భవనాల్లో విశాలమైన తరగతి గదుల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తారు.

5, 6 తేదీల్లో క్రీడోత్సవాలు

రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని మైదానంలో ఈ నెల 5, 6 తేదీల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఉన్న 13 పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వివిధ రకాలైన క్రీడలను నిర్వహిస్తున్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్



వివిధ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు చదివే విద్యార్థులు వారి కోర్సు పూర్తి చేసుకునే లోపే ప్రతిఏటా ప్లేస్‌మెంట్ సెల్ నుంచి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు నిర్వహిస్తున్నాం. ఈ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో బ్లూస్టార్, ఏపీ రాక్, అరబిందోఫార్మా, ఏసీసీ వంటి బహుళ జాతి సంస్థలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు పాల్గొని విద్యార్థులకు మంచి వేతనాలతో ఉద్యోగులుగా తీసుకుంటాన్నారు.

– వినయ్‌కుమార్, ప్రిన్సిపల్, జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రామంతాపూర్

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



సమీక్ష సమావేశంలో డీసీ శంకర్

కాప్రా: సర్కిల్ పరిధిలో వాణిజ్య సముదాయాల యజమానులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ అన్నారు. సర్కిల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోలి కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్లలో రెగ్యులర్ ప్రాపర్టీస్ సుమారు 2,500, ఎస్‌ఆర్ ప్రాపర్టీస్ సుమారు 6 వేల వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఆర్ ప్రాపర్టీస్‌లో ప్రస్తుతం 2 వేల వ్యాపారస్తులకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్ ఉందని, మిగతా 4 వేల వరకు ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఈ ట్రేడ్ లైసెన్స్ పరిశీలన పర్యవేక్షణ బాధ్యతలు ఎస్‌ఎఫ్‌ఏలకు అప్పగించినట్లు డీసీ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఏలు వారివారి పరిధిలో ఉన్న ఎస్‌ఆర్ ప్రాపర్టీస్ లిస్ట్ అందించామని, వాటిని ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలోపు ఎస్‌ఎఫ్‌ఏలు వారికి అప్పగించిన లిస్ట్ ప్రకారం ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయకుంటే చర్యలుంటాయని హెచ్చరించారు. రెగ్యులర్ ప్రాపర్టీస్ మరో 10 శాతం వరకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

సర్కిల్ పరిధిలో ఎవరైనా రోడ్లపై, ప్రజలకు ఇబ్బందికరంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ హెచ్చరించారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా ఏర్పాటు చేస్తే చర్యలతో పాటు జరిమానా తప్పదన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి పొందిన హోర్డింగ్‌లు మినహా ఇతర ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఫ్లెక్సీలు తొలగించాల్సిన బాధ్యత డీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుతం జీహెచ్‌ఎంసీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ స్వప్నారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, ఏఎల్‌ఓ నరసింహారావు, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు



సల్ల భిక్షపతి

కాప్రా: ప్రాణాపాయస్థితిలో ఉన్న కొడుకు వైద్య ఖర్చులకు ఓ నిరుపేద తల్లి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కొడుకుకు వైద్యం కోసం ఆర్థిక సాయం చేయాలని దాతలను కోరుతోంది. కాప్రా డివిజన్ గాంధీనగర్‌కు చెందిన సల్ల భిక్షపతి వెల్డింగ్ షాపులో పనిచేసేవాడు. తల్లి నర్సమ్మ, తండ్రి యాదయ్య, చెల్లెలు శోభారాణితో కలిసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పదేళ్ల క్రితం లివర్ సమస్య వచ్చింది. అప్పటి నుంచి వైద్యం కోసం ఖర్చు చేస్తున్నాడు. వైద్యం కోసం పలుచోట్ల అప్పు చేశాడు. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నాడు. చెల్లెలు ఓ పరిశ్రమలో పనిచేస్తుండగా.. తల్లి కూరగాయలు విక్రయిస్తోంది. ప్రస్తుతం అతడు బతకాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ప్రభుత్వం, దాతలు స్పందించాలని కోరుతున్నారు. సల్ల భిక్షపతి, ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ నంబర్: 20290295988 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0013152). ఫోన్: 91771 62942.

1962 అంబులెన్స్ సేవలు భేష్



ఉప్పల్‌లోని గోశాలలో డా.జాన్ షాహిద్, విదేశీ వైద్య విద్యార్థి బృందం

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1962 అంబులెన్స్ పశు వైద్య సర్వీసులను బుధవారం అమెరికాకు చెందిన విస్కోసిస్ యూనివర్సిటీ వైద్య విద్యార్థి బృందం సందర్శించింది. ఉప్పల్‌లోని వెంకటేశ్వర స్వామి గోశాలను సందర్శించి ఇక్కడి వైద్యం బృందం 1962 అంబులెన్స్‌లతో పశువులకు అందించే వైద్య సేవలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు మేనేజర్ డా.బాగిష్, జాన్ షాహిద్ వివరాలను తెలిపారు. డాక్టర్లు పశువులకు ఇచ్చే ప్రాధాన్యాన్ని వారు అభినందించారు. అనంతరం నాగోల్ జయపురి కాలనీలో మరో యూనిట్‌ను సందర్శించారు. జిల్లా కో– ఆర్డినేటర్ సతీష్ ఎర్రోళ్ల, అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు స్థలం గుర్తింపు



ఉప్పల్ గాంధీ విగ్రహం చౌరస్తా వద్ద ఉప్పల్ పట్టణ పెద్దలు, భారత యువజన సంఘం ప్రతినిధులు

ఉప్పల్: రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని అదే స్థలానికి వెనక్కి జరిపి నిర్మించాలని ఉప్పల్ పట్టణ పెద్దలు, భారత యువజన సంఘం ప్రతినిధుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించి ఉప్పల్ సర్కిల్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. విగ్రహాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు తయారు చేయించి ప్రతిష్ఠిస్తారని తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద రోడ్డు వెడల్పులో సేకరించిన స్థలానికి ఇచ్చే పరిహారాన్ని యువజన సంఘం ఖాతాలో జమచేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మేకల శివారెడ్డి, దుబ్బ నర్సింహారెడ్డి, సల్ల వీరారెడ్డి, పోగుల దయాకర్‌రెడ్డి, కందికంటి అశోక్ కుమార్ గౌడ్, బిక్కుమల్ల అంజయ్యగుప్త, బజారు కృష్ణ, బజారు జగన్, గోనే అర్జున్‌రెడ్డి, బొమ్మగాని దాస్, బజారు మురళి, యువజన సంఘం అధ్యక్షుడు బజారు అర్జున్‌గౌడ్, బింగి జగదీష్ తదితరులు ఉన్నారు.

నేడు వారాంతపు సంత

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నేరేడ్‌మెట్, జేజేనగర్, పీవీఎస్ కాలనీల్లో గురువారం తైబజార్(వారాంతపు సంత) నిర్వహిస్తారు.

వైద్య సేవలు..

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, దంత పరీక్షలు నిర్వహిస్తారు. తాత్కాలిక గర్భనిరోధానికి సలహాలు, సూచనలు అందజేస్తారు.

పీర్జాదిగూడలో ముగ్గుల పోటీలు

మేడిపల్లి: సంక్రాంతి పండగ పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జాతీయ రహదారి పక్కన ఏవీ ఇన్ఫ్రోప్రైడ్ ఎదుట ఉన్న స్థలంలో ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. సంప్రదాయ ముగ్గులతో పాటు కార్పొరేషన్‌లో తడి, పొడి చెత్తపై జరుగుతున్న పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై పోటీ ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వారు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని మొఘల్‌కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను జరగాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, శివ, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వగ్గు చంద్రశేఖర్‌రావుకు బీసీ రత్న అవార్డు



మౌలాలి: మహాజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ కన్వీనర్ ఐలన్న ఆధ్వర్యంలో మౌలాలి డివిజన్‌కు చెందిన వగ్గు చంద్రశేఖర్‌రావుకు బీసీ రత్న అవార్డు అందజేశారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ప్రముఖ జర్నలిస్ట్ సతీష్‌చందర్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ గౌరీశంకర్, పలువురు చేతులమీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు.

బలరాంనగర్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

మల్కాజిగిరి: బలరాంనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. కాలనీలో అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి గుడి వద్ద సీసీ రోడ్డు పూర్తిచేయాలని సూచించారు. యూజీడీ పైపులైన్, నాలా డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ మధురిమ, వీఐ రమేష్ తదితరులు ఉన్నారు.

ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం



ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఉప్పల్ సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజితారెడ్డి, సీనియర్ నాయకులు బోరంపేట కృష్ణ సమక్షంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాకారం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, మహంకాళి రాజు, ప్రధాన కార్యదర్శిగా దేవిరెడ్డి, జాయింట్ సెక్రెటరీగా మధుబాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మహేష్, సంతోష్‌ను ఎన్నుకున్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతానని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. డివిజన్ పరిధిలోని చక్రిపురం కాలనీలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ కాలనీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మురళీధర్, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

33 కేవీ లైన్‌తో తరచూ ఇబ్బందులు

డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో కరెంటు లైన్ ఆలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ బుధవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో చాలా కాలం క్రితం వేసిన 33 కేవీ లైన్‌తో స్థానికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తరచూ కరెంటు అంతరాయం, షార్ట్ సర్క్యూట్ వంటి సమస్యలతో పడుతున్న ఇబ్బందులను వివరించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఇంటి పన్ను చెల్లించని వారిపై చర్యలు



డ్రైనేజీ కనెక్షన్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో సకాలంలో ఇంటి పన్నులు చెల్లించని ఇంటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ పద్మజారాణి అన్నారు. బాలచిత్తారినగర్ కాలనీలో ఇంటి నంబర్: 2–108/5/27, రూ.30,123లు బకాయిలు చెల్లించని కారణంగా కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్‌ను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పన్ను బకాయిలున్న యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నామని, జారీ చేసిన మూడు రోజుల లోపల ఇంటి పన్నుల చెల్లించాలన్నారు. లేదంటే వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. ఇంటి యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కోట వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా రంగోలీ పోటీలు



ముగ్గుల పోటీలో మహిళలు

మల్లాపూర్: నూతన సంవత్సరం, సంక్రాంతి సంబురాల్లో భాగంగా నాచారం అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రంగోలీ పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. పోటీలో పాల్గొన్న మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి ఇందిరారాణి, ద్వితీయ బహుమతి కవిత, తృతీయ బహుమతి స్వర్ణలత గెలుచుకున్నారు. వీరికి రామంతాపూర్ మాజీ కార్పొరేటర్ గంధ్మ జ్యోత్స్న ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. నాచారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిప్పిరి రాజబాబు, ప్రధాన కార్యదర్శి గుమ్మడి సుధాకర్, కోశాధికారి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు తోట ప్రభావతి, అడ్వైజర్ నిర్మల, ప్రధాన కార్యదర్శి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

శంభీపూర్ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

బోడుప్పల్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుట్టిన రోజును పురస్కరించుకుని పలువురు ఆయనకు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్‌యాదవ్, బింగి జంగయ్యయాదవ్, భూక్యా సుమన్ నాయక్, సింగిరెడ్డి పద్మారెడ్డి, నాయకులు పులకండ్ల జంగారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హబ్సిగూడ: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

బండారు రవీందర్ జన్మదిన వేడుకలు



కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్‌రెడ్డి నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఉపసర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు బండారు రవీందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయంలో కార్పొరేటర్లు, నాయకులు డివిజన్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు కె.వెంకటేష్‌గౌడ్, బి.శ్రీకాంత్, 15వ డివిజన్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాజిగిరి: ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని సర్కిల్ ఉప కమిషనర్‌ను మల్కాజిగిరి సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కృపాసాగర్ మాట్లాడుతూ ఆనంద్‌బాగ్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు జైన్ బాలాజీ నిర్మాణ సంస్థ ఫుట్‌పాత్‌ను ఆక్రమించి గ్రిల్ ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఆ ప్రాంతంలో బస్టాప్‌తో పాటు పబ్లిక్ టాయిలెట్స్ ఉండేవని, అవి మాయం అయిపోయాయన్నారు. ఆనంద్‌బాగ్ రోడ్డు విస్తరణ సమయంలో ఆ ప్రాంతంలో డీసీఎం వాహనాలు ఏర్పాటు చేసుకుంటున్న డ్రైవర్లకు కేటాయించిన స్థలంలో ప్రస్తుతం నిర్మాణ సంస్థ వాహనాల పార్కింగ్‌కు అనుమతించడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీసీని కోరామన్నారు. డీసీకి వినతి పత్రం అందజేసిన వారిలో నర్సింగరావు, శ్రీనివాస్, యాదగిరి, ఇమాంపాషా ఉన్నారు.